క్లుప్తంగా

పంట మార్పిడితో మేలు


పమిడిపాడులో రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ ధనరాజ్

మేదరమెట్ల: ప్రతి ఏడాది పంటను మార్పిడి చేసుకొని సాగు చేయడం వలన చీడపీడల బెడద లేకుండా ఉండటంతో పాటు పంట దిగుబడులు పెరిగేందుకు దోహదపడుతుందని ఏడీఏ కె.ధనరాజ్ అన్నారు. కొరిశపాడు మండలంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది లో భాగంగా పమిడిపాడు, ప్రాసంగుల పాడు గ్రామాల్లో మంగళవారం కార్యక్రమం జరిగింది. ఏవో శ్రీనివాసరావు వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంపిణీకి పట్టలు సిద్ధం

బల్లికురవ: రైతులకు టార్పాలిన్ నలుపు రంగు పట్టలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు వెలుగు ఏపీఎం రాజారావు మంగళవారం తెలిపారు. 18-24సైజు రూ.1850కు అందజేస్తున్నామని కావాల్సిన రైతులు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఘనంగా ప్రపంచ సామాజిక సేవా దినోత్సవం


గోవిందస్వామిని సత్కరిస్తున్న దృశ్యం

చినగంజాం: ప్రపంచ సామాజిక దినోత్సవాన్ని మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన చినగంజాం లోని వాల్మీకి వృద్ధాశ్రమంలో సామాజిక సేవా కార్యకర్త, దివ్యాంగుడు ఏకుమళ్ల గోవింద స్వామికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో ఇప్పటి వరకు పలు సేవలు అందించిన అతనిని.. స్టాఫ్‌నర్స్ మస్తాన్‌బీ ఆశ్రమంలోని వృద్ధులు సత్కరించారు.

పొరపాట్లు లేకుండా పనులు నిర్వహించాలి

చినగంజాం: జాతీయ ఉపాధి హామీ పనుల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూడాలని ప్రిసైడింగ్ అధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఏ. విజయలక్ష్మి సూచించారు. మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 2023-24 సంవత్సరానికి చేపట్టిన పనులకు సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం ఏపీఓ జొన్నాదుల లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన పనులను పరిశీలించి తయారు చేసిన నివేదికలను ప్రజావేదికలో అందజేశారు. గత సంవత్సరం వలంటీర్లకు పని కల్పించినట్లు గుర్తించామని పరిశీలకులు వేదిక దృష్టికి తీసుకొనివచ్చారు. వలంటీర్‌లకు వారానికి మూడు రోజులు మాత్రమే పని కల్పించాల్సి ఉండగా ఆరు రోజులు పని కల్పించినట్లు గుర్తించినట్లు తెలిపారు. మరికొన్ని పంచాయతీల్లో వేలిముద్రలు, సంతకాలు లేకుండానే పేమెంట్లు చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. రోడ్డు కిరువైపులా నాటిన మొక్కలు కొన్ని చనిపోయినట్లు గుర్తించినట్లు అధికారుల దృష్టికి తీసుకొని వచ్చారు. ఇకపై పొరపాట్లు లేకుండా పనులు సక్రమంగా జరిపించాలని ప్రిసైడింగ్ అధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఎ. విజయలక్ష్మి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీపీఓ శోభన్‌బాబు, ఎంపీడీఓ ఎ. శ్రీనివాసమూర్తి, పంచాయతీ రాజ్ ఏఈ డి. దాసు, క్వాలిటీ కంట్రోల్ ఏఈ సతీష్, ఎస్ఆర్‌పి. చిరంజీవి, చినగంజాం సర్పంచ్ ఆత్మారావు, ఈసీ సురేష్, సోషల్ ఆడిట్ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరులో జిల్లాస్థాయి భజన పోటీలు

కొత్తపట్నం: శ్రీరామనవమి సందర్భంగా మండలంలో అల్లూరు గ్రామంలో సీతాసమేత కోదండరామస్వామి వారి దేవస్థానంలో జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది పోటీలు జరుగుతాయనని అందులో భాగంగా ఈ ఏడాది కూడా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటలకు పోటీలు ఉంటాయన్నారు. వివిధ రకాల పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మొదటి బహుమతి రూ. 25 వేలు కే పల్లెపాలెం గ్రామానికి చెందిన లంకే మురళీ, రెండో బహుమతి రూ. 20 వేలు శింగమనేని చంద్రశేఖర్ దంపతులు, మూడో బహుమతి రూ.15 వేలు కే పల్లెపాలెం గ్రామానికి చెందిన నాయుడు వెంకటేశ్వర్లు, నాలుగో బహుమతి రూ.10 వేలు అల్లూరు గ్రామానికి చెందిన గుత్తికొండ శ్రీనివాసులురెడ్డి సొంత నగదుతో బహూకరిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు భజన పోటీలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 98496 00159, 99511 60038 నంబర్లలో సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

మందుబాబుల హల్‌చల్

- ఉదయం 6 గంలకే మద్యం విక్రయాలు
- మద్యషాపు వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్
- దుకాణం వీధిలో మహిళలు నడవాలంటే కష్టం


వేటపాలెం సెంటర్లో పూటుగా మద్యం సేవించి..

వేటపాలెం: కూటమి ప్రభుత్వ హయాంలో మద్యం ఏరులై పారుతోంది. గ్రామంలో ఉదయం 6 గంటలకే మద్యం లభిస్తుండటంతో పేదలు మద్యం తాగి ఎక్కడ పడితే అక్కడే రోడ్లపై మత్తుగా పడిపోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమయాలు గాలికొదిలేసిన మద్యం షాపు యజమానులు 24 గంటలు మద్యం అందుబాటులో ఉంచుతున్నారు. దీనితో మందుబాబులు రాత్రీ పగలు తేడా లేకుండా మద్యం సేవించి ప్రధాన సెంటర్‌లో దుకాణాల ముందు మత్తులో పడి పోతున్నారు. దీంతో వ్యాపారులకు నిత్యం సమస్యలగా మారింది. మందుబాబులను పక్కకి వెళ్లమని యజమానులు చెప్పడం తప్పుగా మారుతోంది. మద్యం మత్తులో వారిపై తిరగబడుతున్నారు.

నిత్యం ట్రాఫిక్ జామ్

వేటపాలెం ప్రధాన సెంటర్‌కి దగ్గరలో చీరాల -ఒంగోలు రోడ్డు పక్కనే మద్యం షాపు ఏర్పాటు చేశారు. ఈ మద్యం షాపుకు వచ్చే మందుబాబులు వారి ద్విచక్రవాహనాలు, ఆటోలు ప్రధాన రోడ్డు పైనే అపి మద్యం షాపులోకి వెళుతుండటంతో ఆ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ఈ షాపు పక్కన.. ప్రధాన రోడ్డు నుంచి పద్మశాలీ వీధి లోకి వెళ్లే సిమెంట్ రోడ్డు ఉంది. ఈ రోడ్డులో మందుబాబులు సిట్టింగులు వేసి నిత్యం మద్యం సేవిస్తుంటారు. దీంతో ఈ వీధిలో మహిళలు, చిన్నారులు నడవడం మానేశారు. మార్కెట్ మీదుగా తిరిగి తమ ఇళ్లకు చేరుకుంటున్నారు.

గత ప్రభుత్వంలో..

గత ప్రభుత్వంలో మద్యం షాపులు గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల వరకు షాపులు తెరిచేవారు కాదు. దీంతో మద్యం కూడా లభించేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి మద్యం ఇష్టం వచ్చిన సమయంలో మందుబాబులకు అందుబాటులో ఉంది. దీంతో మందు బాబులు ఫుల్లుగా తాగి మత్తులో రోడ్లపైనే పడి పోతున్నారు. కల్తీ క్వాటర్ బాటిల్ తాగి ఎక్కడ పడితే అక్కడే పడిపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటలకు మద్యం షాపులు తెలిచేలా చర్యలు తీసుకోవాలని మందుబాబుల కుటుంబ సభ్యులు, ప్రజలు కోరుతున్నారు. వైన్ షాపు వద్ద మద్యం కొనుగోలు చేసి వెళ్లేలా మందుబాబులకూ చూసించాలని ప్రజలు కోరుతున్నారు.


మద్యం షాపు ముందు పద్మశాలీ వీధికి వెళ్లే రోడ్డులో తాగి పడిపోయిన మందుబాబు

వైవీ సుబ్బారెడ్డిని పరామర్శించిన కరణం వెంకటేష్


వైవీ సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న కరణం వెంకటేష్

చీరాల: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తల్లి యర్రం పిచ్చమ్మ (85) సోమవారం మరణించగా మంగళవారం మేదరమెట్లలోని ఆయన నివాసంలో ఆమె పార్థివదేహానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డిని పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైవీ తల్లి పిచ్చమ్మకు నివాళులర్పించిన గాదె


సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న గాదె

పర్చూరు(చినగంజాం): రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ మృతదేహానికి పర్చూరు వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం మేదరమెట్లలోని వారి నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైవీని పరామర్శించారు.

తహసీల్దార్‌ను సంప్రదించండి


చినగంజాం తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు

చినగంజాం: సమస్యల పరిష్కారం కోసం స్థానికంగా మండల తహసీల్దార్‌ను సంప్రదించాలని చినగంజాం తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు కోరారు. మండల ప్రజలు తమ సమస్యలను ముందుగా తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని, అన్ని శాఖలకు సంబధించిన సమస్యలను ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో హాజరై తెలియపరచినట్లయితే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నేరుగా జిల్లా అధికారుల దగ్గరకు పోకుండా ఇక్కడే పరిష్కరించుకోవాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి పరిష్కారం చేయదగిన సమస్యలను తామే చేస్తామని సూచించారు. తమ పరిధిలో సమస్య పరిష్కారం చేయలేని పక్షంలో ఆ సమస్య ఎందుకు చేయలేక పోతున్నామనే అంశంపై తాము ఎండార్స్‌మెంట్ అందిస్తామని దానిని జిల్లా అధికారులు, డివిజనల్ అధికారుల దగ్గరకు వెళ్ళి పరిష్కరించుకోవాలన్నారు. కుటుంబ సమస్యలను అధికారుల దగ్గరకు తీసుకురావద్దని, కేవలం ఆధారాలు కలిగిన సమస్యలకు పరిష్కారం మాత్రమే తాము చేయగలమని సమస్యకు సంబంధించిన ఆధారాలను తమ వద్దకు తీసుకొని వస్తే పరిష్కారం చేసేందుకు అందుబాటులో ఉండి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను ప్రజలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.

డంపింగ్ యార్డుగా స్ట్రయిట్‌కట్ కాలువ


స్ట్రయిట్‌కట్ కాలువ కట్టపై ట్రాక్టర్‌తో చెత్త పోస్తున్న దృశ్యం

చీరాల టౌన్: ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ డంపింగ్ యార్డుగా మారింది. మేజర్ గ్రామమైన ఈపురుపాలెంలో సేకరించిన చెత్త, వ్యర్థాలను స్ట్రయిట్‌కట్ కాలువ కట్టపై పోస్తున్నారు. నిత్యం జనసంచారం చేసే తోటవారిపాలెం, బండారు నాగేశ్వరరావు కాలనీ, వీరయ్య నగర్ రెండు గ్రామాలను కలిపే స్ట్రయిట్‌కట్ రోడ్డులో కాలువ అంచువరకు చెత్తను పోయడం, వ్యర్థాలను తగలబెట్టడంతో గ్రామస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రానికి చెత్తను తరలించకుండా ట్రాక్టర్లతో ప్రతీరోజూ స్ట్రయిట్‌కట్ కాలువ అంచున వేయడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. చెత్తను ఊరికి దూరంగా వేసి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

రేణుకాదేవికి ప్రత్యేక పూజలు


రేణుకాదేవి పూజల్లో కరణం వెంకటేష్

చీరాల: పట్టణంలోని బోసునగర్‌లో కొలువై ఉన్న శ్రీరేణుకాదేవి అమ్మవారి 34వ వార్షికోత్సవ తిరునాళ్లను పురస్కరించుకుని మంగళవారం చీరాల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ప్రత్యేక పూజలు చేశారు. రేణుకాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులున్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఫాల్గుణ మాసం విశాఖ నక్షత్రం పంచమి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు మంగళ వారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

జాబ్ మేళా రేపు

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జవహర్ నాలెడ్జ్ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ మంగళవారం తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమో, పీజీ చదువుకున్న 30 సంవత్సరాల్లోపు వయస్సు గల నిరుద్యోగ యువతీయువకులు వారి పూర్తి బయోడేటా, హాజరుకావాలన్నారు. వివరాలకు 7981443777 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఏపీజీబీ మేనేజర్‌కు అభినందనలు


బల్లికురవ: పొదుపుగ్రూపు మహిళలకు బ్యాంకు లింకేజ్ రుణాలు లింక్‌పతి బీబీ రుణాలు అందించడంలో లక్ష్యాలు అధిగమించినందుకు బల్లికురవ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్, సీనానాయక్‌ను మంగళవారం ప్రశంసపత్రంతో అభినందించారు. బాపట్ల జిల్లాలో గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రాజెక్టు డైరెక్టర్ చేతుల మీదుగా అందుకోవటం పట్ల మేనేజర్ రవీంద్రబాబు, అసిస్టెంట్ మేనేజర్ సుహితా గ్రేస్, బిందు మాధవి, సిబ్బంది సీనానాక్‌ను అభినందించారు. 2024 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 20 కోట్ల ఎస్‌హెచ్‌డీ రుణాలు రూ.20 లక్షల లింక్‌పతి బీబీ రుణాలు అందించారు. పొదుపు గ్రూపులు ప్రతినెలా పొదుపును పెంచుకుంటూ తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తూ సిబిల్ స్కోర్ పెంచుకోవాలని కోరారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి


వివరాలు వెల్లడిస్తున్న ఎంపీడీఓ

చీరాల టౌన్: వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ (బీసీ కార్పొరేషన్)ఆధ్వర్యంలో అర్హులైన వారికి స్వయం ఉపాధి కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎంపీడీఓ బి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చీరాల మండలంలోని అర్హులైన బీసీ, ఈబీసీలకు కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణాలు అందిస్తున్నామని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి చీరాల మండలానికి బీసీలకు 78 రుణాలు, ఈబీసీలకు 12 మందికి కలిపి రూ. 1.69 కోట్లు సబ్సిడీ రుణాలకు అందించేందుకు ఈనెల 22లోగా ఆన్‌లైన్‌లో అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, నివాస ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు.. ఏర్పాటు చేయనున్న యూనిట్ల వివరాలతో దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం ప్రింట్లను ఎంపీడీవో కార్యాలయంలోగానీ, గ్రామ సచివాలయాల్లో గానీ అందించాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 25వరకు స్క్రూటీ్న నిర్వహించి అనంతరం వివిధ రకాల పరిశీలన చేసి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. బ్యాంకు అధికారులు, ఎంపీడీవో, ఈవోఆర్డీ ప్రతినిధులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

కన్నుల పండువగా శ్రీనివాసుని కల్యాణం


శ్రీనివాస కల్యాణ మహోత్సవం


స్వామిజీని పూర్ణ కుంభంతో తీసుకొస్తున్న ఆర్యవైశ్య నాయకులు

వేటపాలెం: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీనివాస కళ్యాణ మహోత్సవం మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. మహా పాదయాత్ర సందర్భంగా వేటపాలెం చేరుకున్న పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి బాలస్వామి చేతుల మీదుగా స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. క్షేత్ర పీఠాధిపతి తెనాలి నుంచి తిరుమల వరకు కాలినడకన వెళ్లి వెంకటేశ్వర స్వామిని దర్శించు కోవడానికి బయలు దేరారు. అయితే మార్గ మధ్యంలో వేటపాలెంలో ఆర్యవైశ్యులు పీఠాధిపతికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి కన్యకా పరమేశ్వరి దేవస్థానానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాలం శ్రీనివాసుని కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ప్రత్తి ముత్తుకుమరన్, శ్రీరామ్ గోవర్ధన్‌రావు, చుండూరి గాయత్రి, అమరా సునీత పాల్గొన్నారు.

పనిభారం నుంచి ఉపశమనం కల్పించాలి


ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

చినగంజాం: పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం అప్పజెప్పిన పనిభారం నుంచి ఉపశమనం కల్పించాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఎంపీడీఓ ఏ. శ్రీనివాస మూర్తికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని పంచాయతీ కార్యదర్శులు వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కానీ సెలవుదినాలు కానీ, పండుగదినాలు కానీ వినియోగించడానికి ఏ మాత్రం అవకాశం లేకుండా ఉందని వివరించారు. కుటుంబ సభ్యులతో సమయం గడప లేక పోవడంతో పాటు అనారోగ్యాలకు గురి అవుతూ తీవ్రమైనటువంటి పని ఒత్తిడికి గురవుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు కె. బాబురావు, ఆంజిబాబు, ఉషారాణి, తులసి, సునీత, నాగంద్రబాబు, పి. శ్రీనివాసరావు, కృపారావు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి చికిత్స సాధ్యం


క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చీరాల రూరల్: క్షయ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడుకుంటూ వ్యాధి తీవ్రతను తగ్గించుకోవాలని డాక్టర్ సాంబశివరావు సూచించారు. క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని చీరాల నర్సింగ్ కాలేజీ, పీఎస్ఆర్ చెస్ట్ క్లినిక్‌లో మంగళవారం క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివరావు రోగులకు, నర్సింగ్ కాలేజీ విద్యార్థినిలకు పలు సూచనలు, సలహాలను అందించారు. క్షయవ్యాధికి గురైనవారు బరువును కోల్పోవడం, జ్వరం రెండువారాలుగా తగ్గకపోవడం, రెండువారాలకుపైగా దగ్గు తగ్గకపోవడం, ఆకలి లేకపోవడం , కళ్లెలో రక్తం పడడం వంటి లక్షణాలు కలిగి ఉంటారని చెప్పారు. ఈ లక్షణాలు కలిగినవారు ప్రభుత్వాసుపత్రిలో డాట్ పద్ధతిలో ఆరునెలల పాటు ఉచితంగా అందించే మందులు వాడుకున్నట్లయితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని చెప్పారు. అలానే ప్రభుత్వం ప్రతినెలా రూ. 1,000 చొప్పున బ్యాంక్ అకౌంట్ ద్వారా అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌టీఐఎస్ టి. నాగేంద్రబాబు, డీటీ సాధిక్, ఎస్‌టీఎస్ వర్షధార, టీబీ హెచ్‌వీ శ్రీలక్ష్మి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు


విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కన్స్యూమర్ గ్రీవెన్స్‌సె రెడ్రెసెల్ ఫోరం ఎంతో ఉపయోగపడుతుందని చైర్మన్ ఎస్.విక్టర్ ఇమ్మానియేలు అన్నారు. కన్స్యూమర్ గ్రీవెన్స్‌సె రెడ్రెస్సెల్ ఫోరం విజయవాడ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ముంతావారిసెంటర్‌లోని ఎస్‌జే రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో చీరాల డివిజన్ పరిధిలో మొత్తం 19 మంది విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా అందించారు. 16 ఫిర్యాదులను వెంటనే సీజీఆర్‌ఎస్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేలు పరిష్కరించారు. మిగిలిన మూడు ఫిర్యాదులను తగిన కాలపరిమితిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్ఈ ఆంజనేయులు, చీరాల ఈఈ కె.జాన్‌థామస్, ఏఈఈ బి.హరిప్రసాదరావు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

అద్దంకి రూరల్: అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టిపెట్టాలని సీపీఎం అద్దంకి పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల అద్దంకి పట్టణంలో సీపీఎం నిర్వహించిన పరిశీలనలో గుర్తించిన సమస్యలపై మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో తాగునీరు, డ్రైనేజ్ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. 7 వార్డుల్లోని గుర్రాల కాలనీ, ఎరుకల కాలనీ, మొండితోక పాలెం ప్రాంతాల్లో మురుగునీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత రెండు సంవత్సరాల క్రితం పైపులైన్‌ల కోసం తీసిన గుంతలు అలాగే ఉండటంవల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు.